# బడిపంతులు

శ్రీ దేవులపల్లి హనుమంతరావు

"అయ్యవారి నట్టిల్లు" అని పెద్దలన్నదానికి మనం సాక్ష్యంపలికి 'ఆ సామెతని నిజమైన దానిగా ఋజువుపరుస్తున్నాంరా నాయినా! విన్ననగా చెప్పేనే, నవధాన్యాలూ నిండుకున్నాయి యింట్లో అని' మనింట్లో కాదన్నట్టుగ వూరుకొంటావేమిరా! నువ్వేదో ఉపయోగపడ్తావని భ్రమించానే గాని యింత అప్రయోజకంగా యీ దిక్కుమాలిన అయ్యవారి ఉద్యోగంలో ఉంటావనుకోలేదురా!" అని ఆతల్లి తన ఆవేదనంతా కొడుకుముందు వెళ్ళగక్కింది సమయం దొరికింది గదా అని.

ఉన్న ఒక్కపంచా, చొక్కా ఉతికి, ఉతికి, కట్టుకుంటూ, పంచ ఒకప్రక్క మాసిపోతే, అరవ అయ్యరులా, మడత మార్చి కట్తున్నా, బట్టలు, అప్పుడే ఇంజను నుండి దిగిన కళాసీ బట్టలకిమల్లే నల్లగా అట్టల్లా ఉన్నాయి. దుర్భిక్షంలో, అధికమాసంలా, ఆ చాకలిరామిగాడు, బట్టలతో సహా ఉడాయించేసేడు. పోనీ యీ బట్టలతోటే పోదామా, అంటే ఆ యమధర్మరాజు (ఇనస్పెక్టరు ఆఫ్ స్కూల్సు) మా యీ చిన్ననరకాన్ని (స్కూలు) తనిఖీ చేయటానికి ఇవాళే వస్తాడు. ఈ సమయంలో ఏంచెయ్యటానికీ పాలుపోక ఆకాశంకేసి, శూన్యంగా చూస్తూన్న విద్యాధరరావుని, తల్లి "ఆవేదన" వాస్తవిక జగత్తులోకి తెచ్చింది ఆగ్రహంతో. కా...దు అభిమానంతో, కరద్వయంతో ముఖాన్ని మూసుకొన్నాడు. అతని సహజవ్యక్తిత్వం, అతని అప్రయోజకత్వాన్ని విమర్శించి వెక్కిరించింది. అమ్మా! ఇదిగో! వెళ్తున్నా అన్నాడు రుద్ధకంఠంతో. బరువుగా నడుస్తూ బయటికి వెళ్లాడు. "ఇనుపపాదాలతో నడచె నాపై జగము" అని పాడ్తూంది ఎదుటింటి కొత్త స్కూలు మిస్ట్రెస్. "నిజమే" అనుకున్నాడు. ప్రక్కనున్న పూర్వసువాసినీ (రిటైర్డు) స్కూళ్ళ యినస్పెక్టరు ఆమాత్రం సహాయం చేయడా! అని వెళ్ళాడు. ఎప్పుడో సర్వీసులో ఉన్నప్పుడు, అమాయికపు పల్లెటూరు బడిపంతుళ్ల దగ్గర దమాయించి, దడిపించి, చిత్తుగా లంచాలుకొట్టినప్పుడు రెండుచేతులతో డబ్బు ఖర్చుపెట్టి అలవాటు చేసుకున్న దర్జాలు, షోకులు, యీ అరవైరూపాయల భరణంలో (పెన్షను) ఇమడక, వాటిని వదల్లేక, డబ్బుచాలక యింట్లో వాగ్యుద్ధాలు దినదినమూ చేస్తూన్న ఆమాజీ, యముడు పుర్రచేయి చూపెట్టాడు. లేదనిపించుకున్నందుకు కించపడుతూ, గత్యంతరంలేక, వడ్డీవ్యాపారస్థుడు, ప్లీడరు గుమాస్తాఅయిన కోదండరాముడు దగ్గరకే పోయేడు. పార్టీల దగ్గర వెసీలని, ఇవని, అవని, మోసంచేసి, పుచ్చుకొన్న డబ్బుతో వడ్డీలకు వడ్డీలు

పుచ్చుకుంటూ, పూరిల్లు, పెంకుటిల్లు మేడగా మార్చి ప్లీడరు హోదాలోవున్న ఆ ప్లీడరు గుమస్తా రూపాయికి బేడలయితేనే! అన్నాడు. అవసరం కాబట్టి అలాగే అన్నాడు.

తెల్లనిబిళ్లలు కొన్ని తల్లికిచ్చి, తను కొన్ని తీసుకుపోయి ధోవతులు, కానులు, చొక్కాలు పట్టుకొచ్చాడు. త్వరగా తాను నరకాన్కి (స్కూలు) పోయేడు. ఇంత లేటయిందేం ఇనస్పెక్టరుగారు వస్తారని తెలీదా? చెల్లించు అర్ధరూపాయి చెల్లిస్తే సరి- లేదూ? జీతంలో?? అన్నాడు హెడ్మాష్టరు. ఇచ్చే అసలు జీతం పద్దెనిమిది- అందులో కకూర్త్రి కర్కోటక హెడ్మాష్టరుగారి ముదుపు మూడురూపాయలు. అందులో ఫైన్లు. ఆహా! అయ్యగారి గతి ఇంతే కాబోలు. ఇవాళ హెడ్మాష్టరుగారి భాగ్యమేముందో, ఆకోపం నామీద తిరిగింది అనుకుని అర్ధరూపాయి చెల్లించాడు విద్యాధరరావు.

కుర్చీలో కూలబడ్డాడు. ఒరే! రామం? ఇవ్వాల్టిపాఠం డిక్టేటు చెయ్యరా! వాళ్ళకి! రామం అభిమాన శిష్యుడు.

కిర్సనాయిలు కరువు మూలాన సాయంకాలమే భోంచేసాడు. ఆకలివేస్తుంది. రామం కాఫీ? అన్నాడు. రామం తన విధ్యుక్త ధర్మం నెరవేర్చాడు. కునుకు వస్తూంది. గుర్రూజీకి రామం దిద్దు, పలకలు అన్నాడు.

అంతే యీకాలంలో, గురుశిష్య సంబంధం అలాగేవుంది. దానికి కారణం; పంతుళ్ళ బద్ధకంకాదు. అంతకన్నా కుర్రాళ్ళ అశ్రద్ధ, శక్తిహీనత కాదు. అయ్యవార్ల ఆర్థికవిధానమే వారా దుస్థితినుండి తేరుకుంటే వాళ్లు, నిష్కల్మషంగా, శ్రద్ధగా పాఠం చెప్పగలరు. విద్యాధరరావు తన విద్యార్థిదశలో, తను స్కూలుటీచరుగానూ తనపద్ధతుల ప్రకారం ఆదర్శంగా, పనిచేదామని ఉబలాటపడేవాడు. కాని రంగంలో ప్రవేశించాక, తన ఆర్థికస్థితి, తన ఆశయాలన్నీ, ఆదర్శాలనీ అణగదొక్కింది లోహపాదాలతో. తను ఒక మానవయంత్రంలా! నిమిత్తమాత్రంగా, నిర్జీవంగా, నిర్లిప్తంగా స్కూలుకు రావటం; కుర్చీలో కునకడం. కుర్రాళ్ళు అల్లరిచేస్తే తన్నటం. అంతే అతని నిత్యజీవితం.

తల్లిదండ్రులు, పిల్లలు, ఇంటిదగ్గర అల్లరిచేస్తారని స్కూలుకి పంపినా కొంప మునిగిపోయినట్టు మాస్టారు మావాడేం చదివినట్టు కనబట్టం లేదు. స్కూలుకి డబ్బిచ్చే పంపుతున్నామా! అని హేళన చేస్తారు. కాని వాళ్ళకి కారణం అక్కర్లే. ఈ తప్పు ఎవరిది? ఉపాధ్యాయులదా! వాళ్ళకి జీతాలిచ్చే యజమానులదా! ముమ్మాటికి యజమానులదే. మనది ఎంతమాత్రంకాదు. మన కష్టాన్కి తగిన ఫలితం రాలేదని, మనం అశ్రద్ధచేస్తాం. ఈ ఆర్థికవిధానం సంస్కరింపబడేవరకూ గురుశిష్యసంబంధం యీరీతిగానే వుంటుంది.